సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 16 । మార్చి । 2025



ఇబ్బందులు లేకుండా చూడాలి

హాస్టళ్లలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు.

- 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ ఆది : 6:32 | సహర్ సోమ : 5:01

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.5 /19.6

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పల్లకీ సేవలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

భిక్కనూరు: భిక్కనూరు సిద్దరామేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ప్రతిష్ఠించి, సిద్దగిరి రామగిరి సమాధుల వరకు శోభాయాత్రగా వెళ్లారు. మహిళలు మంగళ హారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. పూజాదులలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

19న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

కామారెడ్డి అర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 8 గంటలకు జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు అండర్–14, 16, 18, 20 కేటగిరిలతోపాటు మహిళలు, పురుషులకు 100, 400 మీటర్ల పరుగుపందెం, జావెలిన్ అంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం లేదా పదో తరగతి మెమో తీసుకుని స్టేడియానికి రావాలని సూచించారు.

ఏజీపీగా షబానా బేగం



నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: జిల్లా కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా షబానాబేగంను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆమెకు నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, న్యాయవాదులు దేవరాజ్, నంద రమేశ్ పాల్గొన్నారు.

భక్తుల ఇంటికే రాములోరి తలంబ్రాలు

కామారెడ్డి టౌన్: భద్రాచల సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలను భక్తులకు ఇంటి వద్దే అందించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ విషయాన్ని కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కార్గో సేవా విభాగం ద్వారా రూ. 151 చెల్లించి బుక్ చేసుకున్న వారికి తలంబ్రాలను హోం డెలివరీ చేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు ఆర్టీసీ డిపోలలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షకు 137 మంది గైర్హాజరు

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 6,767 మంది హాజరు కావాల్సి ఉండగా 6,630 మంది హాజరయ్యారు. 137 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు.


రేపటి వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న మార్చి నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ సోమవారం వరకు కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు బియ్యం తీసుకోనివారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: బీసీ యువతీ యువకులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో హకీంపేటలో ఉచితంగా డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 38 రోజులపాటు హెవీ మోటార్, లైట్ మోటార్ శిక్షణ ఇస్తామని, శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

న్యాయ వ్యవస్థకు డిజిటల్ సొబగులు



న్యాయవ్యవస్థ డిజిటలైజేషన్ వైపు వేగంగా అడుగులు వేస్తోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఇప్పటికే జిల్లాలో ఈ -కోర్ట్స్ సర్వీసెస్ ప్రారంభమైంది. దీని ద్వారా కేసు స్థితిగతులను ఆన్‌లైన్‌లో తెలుసుకునే వెసులుబాటు న్యాయమూర్తులు, న్యాయవాదులతో పాటు కక్షిదారులకు లభించింది. కేసులకు సంబంధించిన పత్రాల డిజిటలైజేషన్ పూర్తి చేసి రికార్డులు, పత్రాలు ఏవి కావాలన్నా ఇట్టే సర్టిఫైడ్ కాపీ ఇచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ–ఫైలింగ్ విధానంతో న్యాయ సేవలు మరింత సులభతరం కానున్నాయి.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటున్న కోర్టులు
- ఇప్పటికే అందుబాటులో ఈ -కోర్ట్స్ సర్వీసులు
- సులభంగా కేసు స్థితి తెలుసుకునేందుకు అవకాశం
- ఈ–ఫైలింగ్‌తో మరిన్ని ప్రయోజనాలు..
- వర్చువల్ విధానంలోనూ విచారణలు

సండే స్పెషల్

భారతదేశ న్యాయ వ్యవస్థ ఎప్పటికప్పుడు నవ్యత్వాన్ని సంతరించుకుంటోంది. ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడంతోపాటు పెండింగ్‌లో ఉన్న కేసులను తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నారు. చట్టపరమైన సేవలు, న్యాయాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ఇప్పటికే ఈ-కోర్టు విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ-కోర్టు అనేది కాగిత రహిత కోర్టు. ఇందులో కోర్టు కార్యకలాపాలన్నీ డిజిటల్ ఫార్మాట్‌లో జరుగుతాయి. కేసుకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు. కక్షిదారు తమ కేసు ఏ స్థాయిలో ఉంది, వాయిదా ఎప్పుడు ఉంది అన్న వివరాలు తెలుసుకునే సదుపాయం ఈ విధానం ద్వారా అందుబాటులోకి వచ్చింది.

ఈ–ఫైలింగ్..

న్యాయవ్యవస్థలో ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన ఈ-కోర్ట్స్ సర్వీసెస్ ద్వారా ఎన్నో రకాల సేవలు అందుతున్నాయి. కోర్టు ఇన్ఫర్మేషన్ సిస్టం (సీఐఎస్) ద్వారా కేసుకు సంబంధించిన వ్యక్తుల ఫోన్ నంబర్లు, మెయిల్ అడ్రస్‌లు ఇస్తే వారికి మెసేజ్‌లు కూడా వెళతాయి. ఈ -ఫైలింగ్ విధానం ద్వారా న్యాయవాది తన ఆఫీసులోనుంచే ఆన్‌లైన్‌లో కేసుకు సంబంధించిన డాక్యుమెంట్లు సమర్పించి కేసును ఫైల్ చేయవచ్చు. రాబోయే రోజుల్లో తన కార్యాలయం నుంచే కేసులను వర్చువల్ విధానంలో వాదించే అవకాశం కూడా కలగనుంది. ఇప్పటికే కొన్ని కేసుల్లో దూరాన ఉన్న వారితో వర్చువల్ పద్ధతుల్లో విచారణ చేస్తున్నారు. కామారెడ్డి నుంచి కొందరు న్యాయవాదులు హైకోర్టులో ఉన్న కేసులకు సంబంధించి వర్చువల్ పద్ధతిలో హాజరవుతున్నారు. అలాగే ఇక్కడి కేసులకు సంబంధించిన సాక్షులు విదేశాల్లో ఉన్నప్పుడు కేసును పరిష్కరించే ఉద్దేశంతో న్యాయవాదులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా వారి వాంగ్మూలం రికార్డు చేస్తున్నారు. పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ జరిగితే మరింతగా సేవలు మెరుగుపడనున్నాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కోర్టుల సముదాయంలో ఈ -సేవా కేంద్రం కూడా ఏర్పాటైంది. దీని ద్వారా పన్నెండు రకాల సేవలు అందించేందుకు కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే కొన్ని సేవలు అందుతున్నాయి.

త్వరలో కేసు పత్రాల డిజిటలైజేషన్

కోర్టుల్లో గుట్టల్లా పెరిగిపోతున్న కేసులకు సంబంధించి రికార్డులను కాపాడడం కూడా న్యాయస్థానాలకు పెద్ద సవాల్‌గా మారింది. దశాబ్దాలుగా పేరుకుపోయిన కేసుల ఫైళ్లకు చెదలు పట్టడమో, తడితో చెడిపోవడమో జరుగుతోంది. ఒక్కోసారి ముఖ్యమైన ఫైల్స్ కూడా దెబ్బతింటున్నాయి. ఈ పరిస్థితిని నివారించేందుకు ఆయా కేసులకు సంబంధించిన రికార్డులన్నింటినీ డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ చేపట్టబోతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే కేసుకు సంబంధించిన రికార్డులు, పత్రాలు ఏవి కావాలనుకున్నా ఇట్టే సర్టిఫైడ్ కాపీ ఇచ్చే అవకాశం ఏర్పడుతుంది. కేసుల వివరాలన్నీ డిజిటలైజ్ అయ్యాక న్యాయవాదులు, న్యాయమూర్తులు ఎప్పుడంటే అప్పుడు ల్యాప్‌టాప్‌లో చదువుకునే వీలు కలుగుతుందని కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ 'సాక్షి'తో పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో 16,500 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కేసుల వివరాలను డిజిటలైజ్ చేసి ఆన్‌లైన్‌లో భద్రపరిస్తే వంద ఏళ్లయినా భద్రంగా ఉంటాయని పేర్కొన్నారు.

అవగాహన కల్పించాలి



డిజిటల్ విధానానికి సంబంధించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించిన తర్వాత అమలు చేయడం మంచిది. న్యాయవాదులతో పాటు కక్షిదారులకు కూడా ఈ -కోర్ట్స్, ఈ -ఫైలింగ్ వంటి వాటిపై అవగాహన అవసరం. అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటేనే డిజిటల్ విధానం విజయవంతం అవుతుంది.

– జి.జగన్నాథం, న్యాయవాది, కామారెడ్డి

సత్వర న్యాయం అందించేందుకు..



ప్రజలకు సత్వర న్యాయం అందించే దిశగా న్యాయవ్యవస్థలో అనేక మార్పులు జరుగుతున్నాయి. ముఖ్యంగా టెక్నాలజీ ద్వారా కేసుల వాయిదాలు, కేసుల స్థితిగతులు తెలుసుకోవడం నుంచి కేసుల ఫైలింగ్ ఇంకా అనేక రకాల సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. న్యాయవాదులు తమ కార్యాలయం నుంచే ఈ -ఫైలింగ్ ద్వారా కేసును ఫైల్ చేసి, వర్చువల్ ద్వారా కేసు విచారణల్లో పాల్గొనవచ్చు. కేసుల విచారణ వేగంగా జరగడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం అందుతుంది. కేసులకు సంబంధించిన డాక్యుమెంట్స్ అన్ని డిజిటలైజ్ అవుతున్నాయి. లైఫ్‌లాంగ్ అవి భద్రంగా ఉంటాయి. ఎవరికి ఏది అవసరం అయినా వారికి సర్టిఫైడ్ కాపీ సులువుగా పొందే వీలు కలుగుతుంది. ప్రతీది ఆన్‌లైన్ ద్వారా జరిగితే పేపర్ అవసరం కూడా ఉండదు. ల్యాప్‌టాప్‌లోనే కేసుల వివరాలను చదువుకునేందుకు న్యాయవాదులకు, న్యాయమూర్తులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటికే ఎన్నో మార్పులు జరిగాయి. త్వరలోనే పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్ జరిగి సేవలు మరింత అందుబాటులోకి వస్తాయి.

– డాక్టర్ సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్, జిల్లా ప్రిన్సిపల్ జడ్జి, కామారెడ్డి

మార్పు మంచిదే...



మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని వాడుకోవలసిన అవసరం ఉంది. పనులు వేగంగా జరగాలంటే సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిందే.. ఆ దిశగా న్యాయవ్యవస్థలో మార్పులు వస్తుండడం ఆహ్వానించదగ్గ పరిణామమే. ఈ విధానాలపై న్యాయవాదులు, కక్షిదారులకు అవగాహన కల్పించాలి.

– శ్రీకాంత్‌గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, కామారెడ్డి

ఆహ్వానించదగ్గ పరిణామం



ప్రపంచమంతా డిజిటల్‌మయంగా మారుతున్న పరిస్థితుల్లో న్యాయవ్యవస్థ కూడా డిజిటలైజ్ కావడం మంచి పరిణామమే. అయితే ఇతర రాష్ట్రాల్లో స్థానిక భాషల్లో ప్రతీది అందుబాటులో ఉంటోంది. తద్వారా సాధారణ పౌరులకు కూడా ప్రతి విషయం అర్థమవుతోంది. మన దగ్గర కూడా దీనిని అమలు చేయాలి.

– క్యాతం సిద్దరాములు, న్యాయవాది, కామారెడ్డి

అప్‌డేట్ కావలసిందే



న్యాయ వ్యవస్థలో టెక్నాలజీ వినియోగం అనేది న్యాయవాదులతో పాటు న్యాయమూర్తులకు ఎంతో మేలు చేకూర్చే అంశం. ఎక్కడ ఉన్నా కేసు వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. అలాగే న్యాయవాదులు తమ కార్యాలయాల నుంచే కేసులు ఫైల్ చేయవచ్చు. వర్చువల్ విధానంలోనూ విచారణకు హాజరు కావొచ్చు. దీంతో సమయం ఎంతో ఆదా అవుతుంది.

– వైద్య అమృతరావు, న్యాయవాది, కామారెడ్డి

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- సమర్థవంతంగా విధులు నిర్వహించాలి
- 'దర్బార్'లో ఎస్పీ రాజేశ్ చంద్ర



మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కామారెడ్డి క్రైం: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీస్ స్పెషల్ పార్టీ, ఎంటీ సెక్షన్, ఎస్కార్ట్, బీడీ టీమ్స్, డాగ్ స్క్వాడ్, ఏఆర్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు తమ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై కూడా సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ రోజూ వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ప్రజలలో పోలీస్ శాఖకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్స్ జోలికి వెళ్లవద్దని సూచించారు. క్రమశిక్షణతో, మంచిప్రవర్తనతో విధులు నిర్వర్తించినప్పుడు అధికారులు అన్నివేళలుగా అండగా ఉంటారని పేర్కొన్నారు.

శిక్షలు పడేలా చూడాలి

కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని రాజేశ్ చంద్ర సూచించారు. కోర్టు విధులు నిర్వహించే సిబ్బందికి శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలపై వేధింపులు, దాడులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, పోక్సో, హత్యలు, దారి దోపిడీలు తదితర కేసుల్లో శిక్షల శాతం పెంచాలని సూచించారు. సాక్షులను షెడ్యూల్ ప్రకారం కోర్టులో హాజరుపరచాలన్నారు. ఎఫ్ఐఆర్ నుంచి చార్జిషీట్ వరకు ప్రతి ఒక్కటి సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ట్రయిల్ బ్రేక్ కావద్దన్నారు. నేరస్తులకు శిక్షలు పడితే నేరాలు తగ్గుముఖం పట్టడమే కాకుండా నేరస్తులలో మార్పు వస్తుందని, ప్రజలలో భద్రతా భావం పెరుగుతుందని పేర్కొన్నారు. కోర్టు డ్యూటీ వర్టికల్‌లో పారదర్శకంగా విధులు నిర్వహించే సిబ్బందికి అవార్డులు, రివార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, ఏఆర్ డీఎస్పీ యాకూబ్ రెడ్డి, ఆర్ఐ సంతోష్, ఎస్బీ సీఐ తిరుపయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

విద్యాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- అచ్చంపేటలో ఏఐ పాఠాలు ప్రారంభం



నిజాంసాగర్‌లో మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్



అచ్చంపేటలో ఏఐ తరగతులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిజాంసాగర్: విద్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కోరారు. శనివారం అచ్చంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కృత్రిమ మేధ సాయంతో విద్యాబోధనకు సంబంధించిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాబోధనలో ప్రాథమిక స్థాయినుంచే విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తోందన్నారు. పేద పిల్లలకూ కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల్లో వెనకబడిన విద్యార్థులకు పాఠాలు అర్థమయ్యేలా బోధించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకుంటోందన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ఉపాధి హామీ పథకంలో మొదటి రెండు విడుతల్లో వచ్చిన నిధులతో చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణాలను ఈనెలాఖరు నాటికి పూర్తి చేయించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మార్చి నెలాఖరు వరకు సీసీ రోడ్లు పూర్తి చేసేలా చూడాలని చెప్పారు. ఆయన వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవోలు గంగాధర్, అనిత, ఎంఈవోలు తిరుపతిరెడ్డి, అమర్‌సింగ్, ఎస్సై శివకుమార్, ప్రధానోపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, లాల్‌సింగ్ తదితరులు ఉన్నారు.

మండలానికి 3 యూనిట్లు

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నిజాంసాగర్‌లోని నిజాంసాగర్ పల్లె ప్రకృతి వనం, మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్ సరఫరాకు ఐకేపీ ఆధ్వర్యంలో మండలానికి మూడు యూనిట్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో సిమెంట్ ఇటుకల తయారీ యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. తక్కువ ఖర్చుతో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిద్ధంగా ఉండాలన్నారు. గ్రామాలవారీగా వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై విచారణ చేపట్టి క్షేత్రస్థాయిలో అనుమతులు ఇవ్వాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు.

ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

పిట్లం: విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం ఆయన పిట్లంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో ల్యాండ్ రెగ్యులరైజేషన్ పురోగతిని, వసూలైన ఫీజు వివరాలను తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ సౌకర్యం గురించి దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వామన్‌రావు, హౌసింగ్ పీడీ విజయ్‌పాల్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కమలాకర్, ఎంఈవో దేవీ సింగ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాండూర్‌వాసికి ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారాన్ని అందుకుంటున్న దత్తు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): హైదరాబాద్‌లోని మయూరి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాలకు మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన కొమ్ము దత్తు ఎంపిక య్యారు. తాండూర్ గ్రామశివారులోని శ్రీ త్రిలింగేశ్వరాలయ కమిటీ చైర్మన్ కొమ్ము దత్తుకు వివిధ రంగాలలో ఉన్న కళాప్రావీణ్యానికి గుర్తింపుగా ఉగాది పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దత్తుకు పలువురు ప్రముఖులు పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు టీవీ ఆర్టిస్టులు, నాట్యగురువులు తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



కొండాపూర్‌లో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని కొండాపూర్ గ్రామంలో శనివారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టెంకాయ కుస్తీ నుంచి మూడు తులాల వెండి కడెం వరకు కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన కుస్తీ వీరులకు నగదు బహుమతులు అందజేశారు. చివరి కుస్తీ 3 తులాల వెండి కడెం గెలుపొందిన విజేతకు కడెం బహుకరించారు. ఈపోటీలు రసవత్తరంగా సాగాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల కేంద్రాలను ఇంటర్ నోడల్ ఆఫీసర్ షేక్ సలాం శనివారం పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 198 మంది విద్యార్థులకు గాను 192 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని చీఫ్ సూపరింటెంట్ నిజాం నోడల్ ఆఫీసర్‌కు సూచించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడవద్దని విద్యార్థులకు సూచించారు.

ఏప్రిల్ 20 నుంచి 'ఓపెన్' పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలో ఏప్రిల్ 20 నుంచి 26 వరకు ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పరీక్షలు 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామంలో శనివారం రాత్రి పోలీసులు బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన జొన్నల భూమయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో, వెంటనే స్పందించి దాడులు చేశారు. 45 మద్యం సీసాలు, మరో 34 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై స్రవంతి తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

ఎల్లారెడ్డిలో ఒకరి ఆత్మహత్య

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఎర్రమన్నుకుచ్చ కాలనీకి చెందిన సిత్తరి బాలకృష్ణ (28)కు అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అప్పుల బాధ తాళలేక అతడు తిమ్మారెడ్డి శివారులోని రామలింగం బావి వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడురు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి
- మద్నూర్‌లో హాస్టళ్ల తనిఖీ



మద్నూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

మద్నూర్(జుక్కల్): హాస్టల్‌లో ఉండి చదువుతున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఇబ్బందులు లేకుండా చూడాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల హాస్టల్‌లను శనివారం సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని అన్ని గదులను పరిశీలించి విద్యార్థులతో ఆమె మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. తాగునీరు, మరుగుదొడ్లు, హాస్టల్ ప్రాంతాలు బాగున్నాయా అని విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నా నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని వార్డెన్‌లను ఆదేశించారు. హాస్టల్‌లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డెన్‌లు, హాస్టల్‌లో పని చేసే సిబ్బంది స్థానికంగా ఉండి విద్యార్థులను చూసుకోవాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ముజీబ్, సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల రాస్తారోకో



బాన్సువాడలో రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



జుక్కల్‌లో ..

బాన్సువాడ/నిజాంసాగర్ : అసెంబ్లీలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు జుబేర్ మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల నుంచి మాజీ మంత్రి జగదీష్ రెడ్డిను సస్పెండ్ చేస్తూ స్పీకర్ ప్రకటించారని, వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలన్నారు. ప్రశ్నించే గొంతుకలను ప్రభుత్వం అణచివేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అలాగే జుక్కల్ మండల కేంద్రంలోని చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మోచీ గణేష్, రమేష్‌యాదవ్, శివ, అనిల్, సంజయ్, చాకలి మహేష్, సాయిలు, గాండ్ల కృష్ణ, గౌస్, మౌలాన, నర్సింలు, రాజు, సద్దాం, నాగరాజు, జుక్కల్ బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు నీలుపటేల్, గంగాధర్, రమేష్, వెంకట్‌గౌడ్, రవీపటేల్ తదితరులున్నారు.

ఈనెల 21న తైబాజర్ వేలం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటికి సంబంధించిన తైబజార్ వేలం పాటను ఈనెల 21న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ. 5వేల రూపాయల డొనేషన్ ఫీజు చెల్లించడంతో పాటు వారాంతపు సంతకు రూ.లక్ష రూపాయలు, రోజువారి సంతకు రూ.75 వేలు, పశువుల సంతకు రూ. 50 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు కాంగ్రెస్ నిరసనలు

కామారెడ్డి టౌన్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి అనుచిత వాఖ్యలు చేశారని ఇందుకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ దిష్టి బొమ్మలను దహనం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌లో కాంగ్రెస్ నాయకులు శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సహకారంతో గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు కోసం రూ.15లక్షల నిధులు మంజూరైనట్లు వారు తెలిపారు. ఈమేరకు ప్రత్యేకపూజలు చేసి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో తాండూర్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి కిష్టయ్య, నాయకులు సంజీవులు, సంగయ్య, హైమద్, సూఫీ తదితరులు పాల్గొన్నారు.

భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: లైంగిక దాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కోర్టులో కేసు ట్రయల్‌కు వచ్చే వరకూ, పరిహారం ఇప్పించేవరకూ 'భరోసా సెంటర్' అండగా నిలుస్తుందని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. కామారెడ్డి లోని వడ్లూర్ రోడ్డులో ఉన్న భరోసా సెంటర్‌ను ఎస్పీ శనివారం సందర్శించారు. అందుబాటులో ఉన్న లీగల్, మెడికల్, చిన్నారుల కౌన్సెలింగ్ గదులు, స్టేట్మెంట్ రికార్డు, సమావేశ గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లో బాధిత మహిళలకు వైద్య, సైకాలజీ, పోలీసులు సహకారం, పరిహారం ఇప్పించడం లాంటి సేవలు అందుతున్నాయని తెలిపారు. బాధితులకు న్యాయపరమైన సూచనలు అందించాలని, అవసరం ఉన్న వారికి భరోసా సెంటర్‌లో ఆశ్రయం కల్పించాలని సిబ్బందికి సూచించారు.

క్రైం కార్నర్

చెరువులో మునిగి ఒకరి మృతి



సాయిలు(ఫైల్)

మాక్లూర్: మండలంలోని చిన్నాపూర్ చెరువు మొరం గుంతలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడిపోయి మృతిచెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. చిన్నాపూర్‌కు చెందిన గోగుల సాయిలు (30) శుక్రవారం హోలీ సందర్భంగా రంగులు ఆడి, స్నానం చేయడానికి సాయంత్రం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు చెరువులోని మొరం గుంతలో పడి గల్లంతయ్యాడు. విషయం తెలిసిన కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం పోలీసులు గజఈతగాళ్లను రప్పించగా, వారు చెరువులో సాయిలు మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతుడి భార్య గంగూబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి క్రైం: చెరువులో పడి ఒకరు మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని నర్సన్నపల్లి గ్రామానికి చెందిన రాసమొల్ల రాజశేఖర్ (27)కు తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి గ్రామానికి చెందిన రమ్యతో రెండున్నరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి 16 నెలల వయస్సుగల కుమార్తె ఉంది. అతడు కామారెడ్డిలోని ఓ ప్రైవేటు షోరూంలో పని చేస్తున్నాడు. హోలీ రోజున తన భార్యను తల్లిగారింటి వద్ద దింపి వచ్చాడు. ఆ తర్వాత అతడి ఫోన్ కలవకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. శనివారం రాజశేఖర్ మృతదేహం చిన్నమల్లారెడ్డి చెరువులో తేలింది. అతని మృతికి గల కారణాలు తెలియడం లేదు. దేవునిపల్లి పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడి భార్య రమ్య తన భర్త మరణంపై అనుమానం ఉందని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో బాలిక అదృశ్యం



సోనమ్‌కౌర్(ఫైల్)

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో ఓ బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి, రైల్వే ఎస్సై సాయిరెడ్డి శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వివరాలు ఇలా.. బాన్సువాడకు చెందిన మహేందర్ సింగ్ తన భార్య, నలుగురు పిల్లలతో కలిసి ఈ నెల 13న నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. నాందేడ్ వెళ్లడానికి దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. కొంతసేపటికి తన కూతురు సోనమ్‌కౌర్(4) కనిపించలేదని, రైలులో వెతికినా ఆచూకీ లభించలేదని మహేందర్‌సింగ్ తెలిపారు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎవరికైనా బాలిక ఆచూకీ తెలిస్తే నిజామాబాద్ రైల్వే పోలీసులకు గాని, ఒకటో టౌన్ పోలీసులకు గాని సమాచారం అందించాలన్నారు.

కాలువలో పడి యువకుడి గల్లంతు



కాలువ వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు



సిద్ధు (ఫైల్)

బాన్సువాడ రూరల్: మండలంలోని జక్కల్‌దాని తండా సమీపంలోని నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడిపోయి గల్లంతయ్యాడు. వివరాలు ఇలా.. మండలంలోని సంగ్రాంతండాకు చెందిన బోడ సిద్ధు (సిద్దార్థ) అనే 19ఏళ్ల యువకుడు శనివారం మిత్రుడు రాజుతో కలిసి సేవాలాల్ దీక్ష చేపట్టడానికి కావాల్సిన షాపింగ్ కోసం బాన్సువాడ వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పెద్దపూల్ బ్రిడ్జి వద్ద కాళ్లు చేతులు కడుక్కోవడానికి ఇరువురు కాలువలో దిగారు. ప్రమాదవశాత్తు ఇద్దరు నీటిలో పడిపోయి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా రాజును స్థానికులు కాపాడారు. సిద్ధు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పోలీసులు గజఈతగాళ్ల సాయంతో కాలువలో గాలిస్తున్నారు.

పాముకాటుతో పదేళ్ల బాలుడి మృతి



ఒడ్డె శ్యామ్ (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని తొండాకూర్ గ్రామంలో ఓ బాలుడు పాముకాటుతో మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలో ఒడ్డె సునీత తన కొడుకు శ్యామ్(10)తో కలిసి ఓ అద్దె ఇంట్లో నివసిస్తోంది. బాలుడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. సునీత కూలీపని చేసుకుంటూ బాలుడిని చూసుకుంటుంది. ఈక్రమంలో శనివారం మధ్యాహ్నం బాలుడు, తల్లి ఇంట్లో నిద్రించగా, నాగుపాము వచ్చి బాలుడి చెవి దగ్గర కాటు వేసింది. తల్లి గమనించి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పామును కర్రతో చంపేశారు. వెంటనే బాలుడిని నందిపేట్‌లోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, నిజామాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. జిల్లా కేంద్రంలో రెండు మూడు ఆస్పత్రులు తిరిగినా వైద్యం చేసేందుకు వైద్యులు ముందుకు రాలేదు. ఆలస్యం కావడంతో బాలుడు మరణించాడు. ఒక్కగానొక్క కొడుకు చనిపోవడంతో తల్లి రోదనలు మిన్నంటాయి.

పశువులను తరలిస్తున్న వాహనాల పట్టివేత



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మీదుగా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాలను బజరంగ్‌దళ్ నాయకులు శనివారం అడ్డుకున్నారు. నిజామాబాద్ జిల్లా సాటాపూర్ నుంచి రెండు లారీలలో పరిమితికి మించి అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్నారన్న సమాచారం బజరంగ్‌దళ్ సభ్యులకు తెలిసింది.దీంతో వారు ఆజామాబాద్ గేట్ వద్ద రెండు లారీలను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు.దీంతో పోలీసులు రెండు లారీలలో ఉన్న పశువులను బిచ్కుంద గోశాలకు తరలించారు.

8 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని పీడీఎస్ రైస్ గోదాంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడులు నిర్వహించి 8 టన్నుల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి ఏసీపీ నాగేంద్ర ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సిబ్బంది పట్టణంలోని 3 గోదాముల్లో ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వచేసిన 8 టన్నుల రేషన్ బియ్యంను పట్టుకున్నారు. వీటి విలువ రూ. 2,80,000 వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. మూడు గోదాముల యజమానులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



కామారెడ్డి మండల సమాఖ్య సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న అడిషనల్ డీఆర్‌డీవో మురళి

- అడిషనల్ డీఆర్‌డీవో మురళి
- మండల సమాఖ్య పాలకవర్గం ఎన్నిక

కామారెడ్డి రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని అడిషనల్ డీఆర్‌డీవో మురళి సూచించారు. శనివారం కామారెడ్డి మండల సమాఖ్య కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కుటుంబాలు అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళ శక్తి కార్యక్రమాలపై, గ్రామ, మండల సమాఖ్య ఎన్నికల విధానాన్ని వివరించారు. మండల సమాఖ్య జనరల్ బాడీ సమావేశంలో నూతన ఈసీ సభ్యులను, నూతన పదాధికారులను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఎన్నికల స్పెషల్ ఆఫీసర్‌గా సదాశివనగర్ ఏపీఎం రాజారెడ్డి హాజరై ఎన్నికలు నిర్వహించారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. సమాఖ్య అధ్యక్షురాలిగా శాబ్దిపూర్ గ్రామ సంఘానికి చెందిన ఎ గోదావరి, కార్యదర్శిగా శ్రీ ఆంజనేయ ఉగ్రవాయి గ్రామ సంఘానికి చెందిన పూజ, కోశాధికారిగా చిన్నమల్లారెడ్డి శ్రీకారం గ్రామ సంఘానికి చెందిన సరస్వతి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మోడల్ మండల సమాఖ్య కార్యక్రమాలపై చర్చించి అమలు చేయాల్సిన అంశాలపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం మోయిజ్, సీసీలు విశ్వనాథం, అంజాగౌడ్, స్వరూపరాణి, అకౌంటెంట్ లత, కంప్యూటర్ ఆపరేటర్, గ్రామ సంఘం అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

'వినియోగదారులకు అవగాహన కల్పించాలి'



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి అర్బన్: ప్రతి వ్యక్తి వినియోగదారుడేనని అదనపు కలెక్టర్ విక్టర్ పేర్కొన్నారు. వారికి హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విషయంలో వినియోగదారుల చైతన్యమే ముఖ్యమన్నారు. వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి మల్లికార్జునబాబు, పౌరసరఫరాల కార్పొరేషన్ జిల్లా మేనేజర్ రాజేందర్, ఆర్డీవో మన్నె ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీవో

లింగంపేట(ఎల్లారెడ్డి): విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఇవ్వాలని ఎంపీవో మలహరి సూచించారు. శనివారం ఆయన లింగంపేట మండలంలోని శెట్పల్లి, పర్మళ్ల, అయ్యపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా వండాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.అనంతరం నర్సరీలు, కంపోస్టు షెడ్లు పరిశీలించారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

ఎల్లారెడ్డిలో ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన



ఎల్లారెడ్డిలో దీక్షలో కూర్చున్న నాయకులు

ఎల్లారెడ్డి: పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చట్టం అమలు చేసి ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో దీక్షలు చేశారు. నాయకులు పద్మారావు, శివనంది, రామచంద్రం తదితరులున్నారు.

కాన్షీరామ్‌కు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

కామారెడ్డి అర్బన్ : బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్ జయంతిని శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మాలోత్ హరిలాల్‌నాయక్, ప్రధాన కార్యదర్శి దుంపల సురేష్, ప్రతినిధులు కే.సిద్ధిరాములు, ఆర్.బాబు, జీవన్, సాయిబాబా, నవీన్, రాములు, దయాకర్, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపల్ రాజిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో టెన్త్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో తమ పిల్లలను ఇంటి వద్ద కూడా చదివించాలన్నారు. ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి స్థలం ఫిర్యాదుపై విచారణ

బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లంక్యాంపులో శనివారం బాన్సువాడ డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి ఓ ఇంటి స్థలం నంబర్ కేటాయింపు ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. జంగం సాయిలు అనే వ్యక్తి గ్రామ పంచాయితీ స్థలంలో కొంతకాలంగా తాత్కాలిక షెడ్డువేసుకుని ఇంటినంబర్ కేటాయించాలంటూ పంచాయితీ కార్యదర్శిని కోరగా గ్రామస్తుల అభ్యంతరం , పంచాయితీ నిబంధన ప్రకారం నంబర్ కేటాయించలేదు. దీంతో సాయిలు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్, పట్టా ఉంటే అందజేయాలని సూచించారు.

పోలీసులు ప్రజలకు రక్షణగా ఉండాలి



సీపీ చైతన్యకు మొక్క అందజేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: నగరంలో చైన్ స్నాచింగ్, వాహనాల దొంగతనాలు, ఇళ్ల చోరీలను అరికట్టి, పోలీసులు ప్రజలకు రక్షణగా నిలవాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విజ్ఞప్తిచేశారు. జిల్లావ్యాప్తంగా సరఫరా అవుతున్న డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని, యువతను వాటి బారిన పడకుండా కాపాడాలన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాయి చైతన్యను శనివారం తన ఛాంబర్‌లో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సీపీకి మొక్కను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో లా అండ్ ఆర్డర్ అదుపు చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ సమస్య, ఫుట్‌పాత్ కబ్జాలు, అక్రమ భూకబ్జాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. జిల్లా అభివృద్ధి, లా అండ్ ఆర్డర్ అదుపు చేయడంలో పోలీస్‌శాఖ తీసుకునే ప్రతి విషయంలో ఎమ్మెల్యేగా తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

సీపీని కలిసిన బోధన్ సబ్ కలెక్టర్

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శనివారం నిజామాబాద్ సీపీ సాయి చైతన్యను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. సబ్ కలెక్టర్‌ను సీపీ స్వాగతిస్తూ అభినందించారు.

వరద కాలువ ద్వారా నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా శనివారం ప్రాజెక్ట్ అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. వరద కాలువ ద్వారా ముందుగా 500 క్యూసెక్కుల నీటి విడుదల ప్రారంభించి క్రమంగా నీటి విడుదలను పెంచుతామన్నారు. కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 250 క్యూసెక్కులు, అలీసాగర్ లిప్టు ద్వారా 540 క్యూసెక్కులు, గుత్ప లిప్టు ద్వారా 405 క్యూసెక్కులు, ముంపు గ్రామాల ఎత్తిపోతల పథకాల ద్వారా 312 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 384 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1071.00(25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

గంజాయి విక్రేత అరెస్టు



గంజాయి విక్రేతను పట్టుకున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్ ఎన్జీవో కాలనీలో గంజాయి అమ్ముతున్న ఓ యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై హరిబాబు శనివారం తెలిపారు. వివరాలు ఇలా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఎన్జీవో కాలనీకి వెళ్లారు. అక్కడ గంజాయి అమ్ముతున్న నిర్మల్ జిల్లా గాజుల నర్సాపూర్ గ్రామానికి చెందిన కోడె సంపత్‌ను పట్టుకున్నారు. అలాగే అతడి వద్ద నుంచి 230 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని నాందేడ్ నుంచి తీసుకుని వచ్చి నిజామాబాద్‌లో అమ్ముతున్నట్లు అతడు తెలిపాడు. ఈమేరకు కేసు నమోదు చేశామన్నారు.